కనక ప్రజాసామాన్యానికి శ్రేయస్సు కూర్చే భావాలను వాళ్ళకు నచ్చేటట్టు చెప్పటమే ఉత్తమ రచన అవుతుంది.

[ఇందులోని భావాలు 'నచ్చలేదు' అనే
నా రేడియో ప్రసంగంలోవి.]

## ఆత్మ విశ్వాసం

ఈమధ్య భాషాభిషక్కుల్లో చాలా అహంకారం బలిసినట్లు కనిపిస్తుంది. దీనికికారణం ఏమిటా అని నేను చాలా ఆలోచించాను. నాకు ఒక్కటే తట్టింది. చాలామంది పెద్దవాళ్ళు ఆత్మవిశ్వాసం మనిషికి అవసరమనిచెప్పారు. ఈ అభిప్రాయమే భాషాభిషక్కుల్లో అహంకారాన్ని పెంచిందని నా అనుమానం.

కాని ఈ భాషాభిషక్కులు ఒక సంగతిమాత్రం మరచి పోగూడదు. ఆత్మవిశ్వాసం రెండురకాలుగా కలుగుతుంది. ఒకటి జ్ఞానం వల్లా; రెండు అజ్ఞానంవల్లా.

సర్వమూ తెలుసుకొని, అందరికంటే నాకు ఎక్కువ తెలుసని ఒకరను కుంటారు. బాహ్యప్రపంచమే తెలియకపోవటంవల్ల అందరికంటే నాకు ఎక్కువ తెలుసని ఒకరనుకుంటారు.

మన భాషాభిషక్కులు ఈ రెండోరకానికి చెందుతారేమో నని నా భయం.

ఈమాట అన్నానని కోప్పడవద్దు. ఒప్పుకోవటం మంచిది. లేకపోతే ఆత్మవిశ్వాసాన్ని పొందేటంత జ్ఞానాన్ని సంపాదించటం మంచిది.

—O—